1984 రక్షాక్షి ఉగాది సస్పెన్స్ కథలపోటీలో మూడవ బహుమతి పొందినకథ

పగలంతా నిప్పులు చెరిగిన సూర్యుడు చల్లబడటంతో, గాలి కూడా చల్లబడింది. పార్కులో జనం పల్చ పల్చగా వున్నారు. దూరంగా పిల్లలు గోలగా అరుచుకుంటూ ఆడుకుంటున్నారు.

# ఉష్....

శంకరమంచి పార్థసారధి

సుందరం పార్కులోకి ప్రవేశించి ప్రతి సాయంత్రం కూర్చునే సిమెంటుబల్ల మీద సర్దుకూర్చున్నాడు. గాలి చల్లగాను, పగలంతా కాలిన సిమెంటుబల్ల వేడిగాను వుండటంవల్ల, రెండిటికి సమన్వయం కుదుర్చుకుని సమాధానం చెప్పుకోలేనివాడిలా అసహనంగా వున్నాడు.

అలా కూర్చుని ఆలోచిస్తున్న అతడి మస్తిష్కంలో– ముసలి తల్లిని, చెల్లిని తమతమ కర్మలకొదిలి, వెచ్చటి ఆప్యాయతలకన్నా, కౌగిలిలోనే కైలాసమని అన్నయ్య వేరే కాపురం పెట్టిన వైనం, చదువుకున్నా ఉద్యోగంలేని తన దుస్థితి, రెండు నెలలుగా అద్దె కట్టకపోవడం వల్ల అగ్గిరాముడయ్యి, రేపు సాయంత్రంలోగా అద్దె చెల్లించని పక్షాన సామాన్లు, వాటితోపాటుగా మనుషులు కూడా వీధిలో వుంటారని చివరిసారిగా హెచ్చరించి వెళ్ళిన యజమాని, చెల్లెలు టీచరు గిరి వెలిగించి తెస్తున్న వంద రూపాయలు, తండ్రి ఫించను కలిపినా ఎటూ సరిపోక ఇబ్బంది పెడుతున్న ఇరుకు జీవితం– గాలిపటాల్లాగా విహరిస్తున్నాయి.

అంతలో ఒక తెల్లటి ఫియెట్ కారు తళతళలాడుతూ వచ్చి ఆ పార్కు గేటు ముందాగింది. వెంటనే దానిలోంచి ఒక భారీ శరీరం హుందాగా దిగింది. ఆ వ్యక్తి ఎర్రగా వున్నాడు. విశాలమైన ఫాలభాగం. అంటుకుపోయినట్లున్న నొక్కుల క్రాపు. మెళ్ళో మెరుస్తున్న జిగినీ గొలుసు. వేళ్ళకు వుంగరాలు. ఖరీదైన బట్టలు. అతను చాలా గొప్పవాడు సుమాని చాటి చెపుతున్నట్లుగా వున్నాయ్. అతడా విధంగా కారుదిగి బరువుగా నడుచుకుంటూ తనిఖీకొచ్చిన అధికారిలా వచ్చి పార్కు మధ్యగా నిల్చుని ఎవరికోసమో వెతుకుతున్నవాడిలా ఇట్టూ చూస్తున్నాడు. అలా కొద్ది క్షణాలు చూస్తూ నిల్చుని తర్వాత ఏదో నిర్ణయించుకున్న వాడిలా మళ్ళీ కదిలి సుందరం కూర్చున్న బల్లని సమీపించి, తనూ ఒక ప్రక్కగా సర్దుకుని కూర్చున్నాడు. ఆలోచనల్లో వున్న సుందరం అతడి రాకని గుర్తించలేదు.


అలా కూర్చున్న ఆ వ్యక్తి తన చేతికున్న బంగారపురంగు వాచీలో టైము చూసుకున్నాడు. అటు తర్వాత గేటువంక వస్తున్న జనంవంక చూసేడు–అటుతర్వాత తనలో జనించిన నిరుత్సాహాన్ని, విసుగుని 'ష్చ్' అని పెదవుల కలయికతో ప్రకటించి, అటు పిమ్మట జేబులోంచి సిగరెట్టు పెట్టెను బయటికి తీసి, ఒక సిగిరెటుని పెదిమల మధ్య సవిలాసంగా వుంచి అంటించుకుంటూ—సుందరంవంక చూసేడు.

సుందరం వయస్సుకి తగ్గ తిండిలేకపోవడంవల్ల సన్నగా వుంటాడు. అతడి జుట్టు నూనెమొహం ఎరుగక ఎర్రటి పీచులా వుంటుంది. అతడి కళ్ళు దిగుళ్ళ వల్ల లోతుకుపోయి మురికిగుంటల్లాగా వుంటాయి. విశాలంగా వుండే ముక్కు విశ్రాంతి తీసుకుంటున్నట్లుగాను, నవ్వటం ఎరుగని పెదిమలు బాల్యంలోనే వైధవ్యం పొంది అందరివంక భయం భయంగా చూసే ఆడపిల్లలాగాను వుండి, ఇవన్నీ కలిపి ఒక్కసారిగా చూస్తే అతడు పిచ్చివాడిలా, విడివిడిగా విశ్లేషించి చూస్తే మేధావిలాగాను వుంటాడు. అతడి ప్రక్కన కూర్చున్న ఖరీదైన వ్యక్తి వింతగా రెండు క్షణాలు చూసేడు. అదే సమయానికి సుందరానికి ఎవరో తనని గమనిస్తున్నారనిపించి, తలని త్రిప్పి ఆ వ్యక్తి వంక చూడటంతో, ఇద్దరి చూపులు కల్సుకోగా, ఆ వ్యక్తి పలకరింపుగా నవ్వాడు.

సుందరానికి కలిగినవాళ్ళంటె గౌరవం, అంతకుమించి భయము వున్నాయి. అంచేత నవ్వుతున్న అతడిని చూసి భయంగా నవ్వేడు.

పిలుస్తూ "నీ పేరేమిటి?" అని ప్రశ్నించాడు. సుందరం బెరుకుగానే బదులిచ్చాడు. అతడు మళ్ళీ తన వాచీలో టైము చూసుకుని, గేటువంక చూసి.మళ్ళీ నిరుత్సాహం ప్రకటించి. ఏదో చప్పున స్ఫురించిన వాడిలా తలత్రిప్పి సుందరంతో. "నాకో చిన్న పన్చేసి పెట్టకూడదూ!" అన్నాడు చాలా సాధారణమైన ధోరణిలో.

సుందరానికి అతడి మాటయితే విన్పించిందిగాని. భావం అర్థంకాక అతడి వంక తెల్లబోయి చూసేడు అతడు చిన్నగా తమాషాగా నవ్వి "వూరికినే వద్దులే-అయిదు నిమిషాలపని. అయిదొంద లిస్తాను" అనేసి మళ్ళీ గేటువంక చూసేడు. ఆ మాట విన్న సుందరానికి గుండె ఆగిపోవటంగాని. స్మృతిహతవ్వటంలాటి వుపద్రవాలు సంభవిస్తాయేమోనని భయం వేసి. ఆ భావాలుఅతడికి అంటకూడదన్నట్లు తల దించుకున్నాడు. అతడు చివరికి ఏదో ఒక నిర్ణయానికొచ్చిన వాడిలా. సుందరంవైపుగా కొత్త జరిగి. అతడిని సూటిగా చూస్తూ



"చేస్తావా?-చూడబోతేచదువుకునివుద్యోగం లేక డబ్బు చిక్కుల్లో వున్నవాడిలా కన్పిస్తున్నావ్. చేస్తావా-అయిదు వందలు! ఫైవ్ హండ్రెడ్సు"- ప్రలోభ పెడుతున్నవాడిలా అన్నాడు.

సుందరం లేని ధైర్యాన్ని కూడగట్టుకొని బింకంగా "ఏం చెయ్యాలి? అసలు మీరెవరు? పేరేమిటి" అనడిగాడు.

ఆ మాట విన్న అతడు చిరాకుగా మొహం పెట్టి. మళ్ళీ సిగరెట్టు పొగ పీల్చి "కొన్ని కారణాల వల్ల నీ ప్రశ్నలకి సమాధానం ఇవ్వలేను. నువు సరేనంటే ఏం చెయ్యాలో చెబుతాను. కాదంటావో ఇంకెవరినైనా చూసుకుంటా"నంటూ భారీశరీరాన్ని కదిల్చే ప్రయత్నం చేసేడు. అతడన్న చివరి మాట. శరీరపు కదలిక సుందరంలో ఏదో భయాన్ని. వెతుక్కుంటూ వచ్చిన అదృష్టం చేజారి పోతున్నట్టుగా కంగారుని సృష్టించాయి.


అయిదు వందలు!

ఆ డబ్బులతో ఇంటి అద్దె. కిరాణాషాపు వాడికి పూర్తిగాకట్టేసి. ఇంకా తల్లికి మొన్న డాక్టరు వ్రాసిచ్చిన మందులు కూడా కొనవచ్చు— కాని ఇంతకీ ఏమిటి చెయ్యాలిట?

అదే ప్రశ్నని భయం భయంగా అడిగాడు- ఆ వ్యక్తి సుందరం ప్రశ్న విని మళ్ళీ చిన్నగా నవ్వి "అంటే ఒప్పుకున్నట్లేనా?" అన్నాడు.

సుందరం సరేనని తలాడించబోయి. వెంటనే" ....కానిగొడవులేం జరగవుగా?" అన్నాడు అమాయకంగా. ఆ మాట విని అతడు ఈసారి పెద్దగా నవ్వాడు. చేతిలోంచి జారిపోయిన సిగిరెట్టుని బూటు కాలితో నొక్కి. "నీకా భయాలేం అక్కర్లేదు. కాని అంతా విని చెయ్యనంటె నాకోపం వస్తుంది. తర్వాత నీ యిష్టం" అన్నాడు తనకి కోపం రావటం ప్రపంచానికి మంచిది కాదంటున్నట్లుగా.

సుందరం రెండే రెండు క్షణాలు ఆలోచించాడు. ఆటు తర్వాత దృఢ నిశ్చయంతో. "సర్. అలాగే మీరు చెప్పిన పని చేస్తాను.కాని నాపైకి ఏమీ రాదని. నాకేంకాదని హామీనిస్తే చెయ్యటానికి సిద్ధం" అన్నాడు.




ఆ మాట విన్న అతడి మొహంలో ఏదో ప్రసన్నత కన్పించింది. "గుడ్. అయితే ఏం చెయ్యాలో చెపుతాను జాగ్రత్తగా విను" అంటూ చెప్పటం మొదలు పెట్టాడు.

పార్కులో రద్దీ పెరిగింది. విచిత్రంగాను, విరుద్ధంగాను పిల్లల గోల తగ్గింది. మొక్కల చాటున కొత్త దంపతులు హద్దు మీరుతున్నారు. వాళ్ళని గమనిస్తున్న స్టూడెంట్ కుర్రాళ్ళు సన్నగా మాట్లాడుకుంటూ చిన్నచిన్నగా నవ్వుకుంటున్నారు.

దూరంగా గేటుబయట వున్న తన కారు వంక దీక్షగా చూస్తూ ఆ వ్యక్తి. "నిన్ను నేను కార్లో ఒక చోటికి తీసుకెడతాను. అక్కడ నీకొక యిల్లు చూపిస్తాను. ఆ యింటికి తాళం వేసుంటుంది. దాని తాళం చెవిగూడా నేను ఇస్తాను. నీవు ఆ యిల్లు తాళం తెరచి లోనికెళ్ళాలి. ముందు గదిలో టీపాయిపైన నోట్ బుక్కు ప్రమాణంలో వున్న తోలుసంచీ ఒకటుంటుంది. దాన్ని తెచ్చి నాకివ్వాలి —దట్సాల్—!"

సుందరం అయోమయంగా అర్థం కానట్లు చూసేడు. "ఆ యిల్లెవరిది? ఆ సంచీలో ఏవుంది?" ఆత్రంగా అడిగాడు. ఆ ప్రశ్న విన్న అతడు నవ్వాడు. కాని ఆ నవ్వులో స్నేహభావం లేదు సరికదా కించిత్తు కర్కశత్వం గోచరించింది. "ఉష్ చెప్పానుకద ప్రశ్నలడగొద్దని. చెప్పినట్లు చెయ్యాలి" అన్నాడు కఠినంగా.

సుందరానికి అతడిని చూస్తుంటే మొదటిసారిగాభయంఅన్పించింది. "అంటే ఆ ఇల్లు...." అని మళ్ళీ అడగబోయాడు.

అతడు చటుక్కున లేచి నిల్చున్నాడు. అతడి మొహం గంభీరంగా మారింది. దెబ్బతిన్న పులిలా అవుపించాడు. "నిన్ను పదేపదే అడుగుతుంటే నువ్వు తప్ప నాకు వేరే గతి లేదనుకుంటున్నావ్ కదూ? అటు చూడు అక్కడ బల్లపై వెల్లికిలా పడుకుని బీడీ తాగుతున్న ఆ గళ్ళ లుంగీ వ్యక్తికి ఇరవై రూపాయలు— కేవలం ఇరవై రూపాయలిస్తే చెప్పినపని ప్రశ్నలడగకుండా చేస్తాడు."

సుందరం అతడితోపాటుగా అప్రయత్నంగా లేచి నిల్చొని అతడి వంక వెర్రిగా చూస్తున్నాడు. అతడు కదిలి వెళ్ళబోతూ "నీలాంటి పిరికివాళ్ళు జీవితంలో ఏదీ సాధించలేరు" అనేసి చరచరా నడవడం మొదలెట్టాడు. సుందరంలో కంగారు. అందోళనఅధికమైనాయి ఆలోచించేవ్యవధి కూడా లేకపోవడం వల్ల. పరుగులాటి నడకతో అతడిని సమీపించి "సర్ అలాగే చేస్తాను" అన్నాడు.

నడుస్తున్నవాడల్లా ఆ వ్యక్తి ఆ మాట విని కాళ్ళకి బ్రేకులు పడ్డట్టుగా ఆగేడు. ఆగినప్పుడు అదేనవ్వు - చిద్విలాసాన్ని చిందించే నవ్వు. అతడుసుందరం భుజంపై చెయ్యివుంచి తిరిగి కారు నిల్పిన వైపుగా నడవటం ప్రారంభించాడు. అతడు నడుస్తూ "అయిదు నిమిషాల పని. ఎవ్వరూ నిన్ను ప్రశ్నించరు. అనవసరంగా కంగారుపడకు. అయిదు వందలు తక్కువ మొత్తం కాదు. తాత్కాలికంగానే అయినా నీ కష్టాలు తీరుతాయి" అన్నాడు.

సుందరానికి ఎన్నో ప్రశ్నలడగాలనిపించింది—"ఆ యిల్లెవరిది? ఆ సంచీలో ఏవున్నాయ్? ఇతడెవరు? తనే వెళ్ళక నన్నెందుకు పంపిస్తున్నాడు?" కానీ ఏవీ మాట్లాడలేదు. ఇద్దరూ కారుని సమీపించేరు. అతడు డోరుతెరచి తను డ్రైవింగుసీటులో కూర్చొని. అటువైపు డోరు తెరవగా సుందరం ఎక్కి ఒక ప్రక్కగా ముడుచుకుని కూర్చున్నాడు.

కారు కదిలింది.

సుందరం బయటికి చూస్తూ ఆలోచిస్తున్నాడు. చెయ్యవలసిన పని తల్చుకుంటే భయం. రాబోయే ప్రతిఫలం తల్చుకుంటె సంతోషం—చల్లగాలి రివ్వున చంపలకి తాకుతోంది.

పది నిమిషాల ప్రయాణం ఆ తర్వాత కారునాపాడు. ట్రాఫిక్‌కి అడ్డులేకుండా ఒక ప్రక్కగా ఆపి, ఆ వ్యక్తి క్రిందికి దిగాడు. వెంటనే సుందరం కూడా దిగివచ్చి అతడి ప్రక్కగా నిలబడ్డాడు. ఆ వ్యక్తి మళ్ళీ ఒక సిగరెట్టు ముట్టించి సుందరంతో "అటు చూడు. అ కన్పిస్తున్న గోపీరంగు రెండంతస్థుల భవనమే నే చెప్పిన ఇల్లు" సూటిగా చూపిస్తూ అన్నాడు.

సుందరం ఆ భవనం వంక గుడ్లప్పగించి చూడసాగాడు.

అతడు మళ్ళీ అన్నాడు. "గేటు తెరచి లోనికి ప్రవేశించగానే ఎదురుగా కనిపించే మెయిన్ బిల్డింగు కాక ఎడమ వైపుకు తిరుగుతూ పూల మొక్కలని దాటి ముందుకెడితే, వరుసగా మూడు పోర్షన్స్ కన్పిస్తాయి. వాటిల్లో మధ్యనున్నదే నే చెప్పిన యిల్లు. గుర్తుంటుందా?" అనడిగాడు.


సుందరం దీక్షగా అటువైపు చూస్తూనే వుంటుందన్నట్లుగా తలూపాడు.

అతడు మళ్ళీ అన్నాడు. "అక్కడ మొదటి పోర్షన్‌లో ఎవరివో వ్యాపారస్తుడి తాలూకు ఫ్యామిలీ వుంటున్నారు. సాధారణంగా తలుపు లెప్పుడూ వేసేసి వుంటాయి. ఇక మూడవ దానిలో ఈమధ్యనే చిట్‌ఫండ్ కంపెనీ తాలూకు బ్రాంచి ఒకటి తెరిచారు. ఎప్పుడూ జనం వస్తూ పోతూంటారు. ఒకవేళ నిన్నెవరైనా ప్రశ్నించినా ఆ కంపెనీకి వెడుతున్నట్లుగా చెప్పవచ్చు. అర్థమయిందా?" అనడిగాడు.

ఆ క్షణంలో సుందరం కళ్ళకి ఆ వ్యక్తి పద్మవ్యూహంలోకి ఎలా ప్రవేశించాలో అనే కాకుండా, ఎలా బయట పడాలో కూడా చెప్పేసిన పిచ్చి పార్థుడిలా అవుపించేడు.

అంతలో ఆ వ్యక్తి జేబులోంచి తాళం చెవి తీసి సుందరం చేతిలో వుంచాడు. సుందరం దానివంక పరీక్షగా చూసేడు అది డూప్లికేట్‌ది కావచ్చు. లేక కాకనూ పోవచ్చు. గొప్పింటి ఇల్లాలి పాతివ్రత్యంలా నిర్ధారించి చెప్పటం కష్టంలా తోచింది. దాన్ని చిత్రంగా చేతిలో బిగిస్తూ "ఒకవేళ నే వెళ్ళేసరికి ఆ యిల్లు తాళం తీసుంటే?" అని సందేహాన్ని ప్రకటించాడు.

ఆ ప్రశ్నని విన్న ఆ వ్యక్తి ఆ విషయమే తనకు తట్టనట్లుగా రెండు క్షణాలు దర్పంగా ఆలోచించి. "సరే- ఒకవేళ ఆ ఇల్లు తాళం తీసుంటె వెనక్కి తిరిగొచ్చేయ్- కాని ఒక విషయం—




"ఏమిటి ?"

"నాతో అబద్ధం చెప్పే ప్రయత్నం చెయ్యకు - తాళం వేసున్నా. లేక నే చెప్పినట్లుగా సంచీ అక్కడున్నా కూడా నీ భయం కొద్దీ తిరిగొచ్చి బుకాయించే ప్రయత్నం చెయ్యకు. ఎందుచేతనంటే. ఆతోలుసంచీని తెచ్చి యిస్తేనే నీకు అయిదు వందలు దక్కేది. త్వరగా పని ముగించుకొని వచ్చెయ్. నేనిక్కడే ఎదురుచూస్తూ ఉంటాను" అనేసి తిరిగి కారులో కెక్కి డాష్‌బోర్డులోంచి పేపరు తీసి ఏమీ ఎరుగని వాడిలా చదువుతూ కూర్చున్నాడు.

సుందరం కదిలాడు.

గుండె గొంతుకలోనికొచ్చినట్లుగా వుంది. భయంవల్ల మొహం పాలిపోయి. అడుగులు మెల్లిగా పడుతున్నాయి. ధరించిన ఖద్దరు చొక్కా ఒక్కసారిగా బరువెక్కి. కంబళీ కప్పుకున్నట్లు వుక్కపెట్టి బాధిస్తోంది. తాళంచెవిని గట్టిగా పట్టుకోవటంవల్ల నెప్పిగా అన్పిస్తోంది. అతడు మెల్లిగా నడుస్తున్నాడు. అతడికర్థంకాని విషయం- ఇంత చిన్నపనికి అయిదువంద లెందుకిస్తున్నట్లు? ఎక్కడుంది కీలకం? అసలా ఇల్లెవరిది? ఆ సంచీలో ఏవుంది? అవసరం కొద్దీ ఆ పనికి ఒప్పుకున్నాడేగాని. అతడికి చాలా భయంగా వుంది. ఆలోచిస్తూనే భయం భయంగా ఆ గోపీరంగు భవనాన్ని సమీపించి. దానివంక పరీక్షగా చూసేడు.

అది రెండంతస్థుల భవనం. కొత్తగా రంగులు వేయటంవల్ల కాబోలు చాలా అందంగాను, హుందాగాను కన్పిస్తోంది. ఆ మేడకి పైన గదిలో మాత్రమే లైటు వెలుగుతోంది. సుందరం ఎండిపోతున్న గొంతుని తడిచేసుకుంటూ అటూ ఇటూ చూసేడు. దూరాన్నించి గడియారపు గంటలు భయంకరంగా విన్పిస్తున్నాయ్. ప్రక్కయింటిలో చంటబ్బాయ్ గుక్కలు పట్టి ఏడుస్తున్నాడు.

సుందరం ధైర్యంచేసి కదిలేడు. గేటుని సమీపించి. మళ్ళీ ఒకసారి రెండు వైపులా చూసి. గేటు లోనికి మెల్లిగా నెట్టేడు ఏమీ జరగలేదు. కాని గేటు మెత్తగా తెరుచుకుంది. అతడు లోనికి అడుగు పెట్టేశాడు. అంతా చీకటిగా వుంది. ప్రక్కనున్న పూలచెట్ల మధ్యనుంచి కీచురాళ్ళ శబ్దం భయంకరంగా విన్పిస్తోంది. గడియారంపు గంటలా కొట్టుకుంటున్న గుండెని దిటవు పర్చటానికన్నట్లుగా ఆ చీకట్లో. పూల మొక్కల మధ్యన ఒక్క క్షణం ఆగి. ఆ వ్యక్తి చెప్పిన విషయాలని స్మరించుకున్నాడు. అటు తర్వాత మెల్లిగా కదిలి. ఎడమ వైపుకి పదడుగులు. కేవలం పదడుగులు వేసేదో లేదో అప్పుడు జరిగింది-

ఎక్కడినించో అల్సేషన్ కుక్క భయంకరంగా రక్తం గడ్డకట్టేలా అరవడం మొదలెట్టింది. సుందరం శరీరంలోని రక్తం భయంతో జిలజిల్లాడింది. కాళ్ళు చేతులు చల్లబడ్డాయి. గుండె ఏక్షణానైనా ఆగిపోతుందేమోననిపించింది. అసలా కుక్క ఎక్కడనించి. ఏవైపునించి అరుస్తోందో అర్థంకాలేదు.ఏ క్షణానైనా పులిలాగా మీదికి దుముకుతుందోమోనని భయంవేసి. వెనక్కి తిరిగి పారిపోవాలని సన్నద్ధుడయ్యి ఒక క్షణం ఆగేడు. బుర్ర ఒకక్షణం పన్చేసింది. ఇంతసేపుగా అడుస్తున్నా ఆ శబ్దం ఒకే దూరం నించి విన్పిస్తోందిగాని. దగ్గిరవడం లేదు. అంటే ఆ కుక్క కట్టివేయబడివుంది!

ఆ ఆలోచన రావడంతో అతడికి ధైర్యం వచ్చి చుట్టూ పరికించేడు. ఎడమవైపునున్న మూడు పోర్షన్స్‌లో మొదటి ఇంట్లోంచి అరుస్తోంది.

ఆ యింటికి కటకటాల తలుపుండి లోపలంతా చీకటిగా వుంది. అంటే ఆ కుక్క అక్కడ ముందుగదిలో వుండి వుంటాలనుకున్నాడు. అలా అనుకుని కదలబోయే సమయానికి ఎవరోఆడమనిషి ఇంగ్లీషులో కుక్కని ఏదో తిడుతూ బయటికి వస్తోంది.

సుందరానికి వున్న వ్యవధి చాలా తక్కువ. వెనక్కి తిరిగిగాని లేక ముందుకిగాని వెళ్ళాలి. లేనిపక్షంలో ఆ యువతి ప్రశ్నించే ప్రమాదం వుంది. ఏంచెయ్యాలి? కుక్క మొరుగుతూనే వుంది.ఒకేఒక క్షణం ఆలోచించి. చకచకా నడుస్తూ ముందుకు సాగేడు. ఆ వ్యక్తి చెప్పిన మధ్య పోర్షన్ ముందు నిలబడి ఒక క్షణం గుండెలనిండుగా గాలి పీల్చుకున్నాడు. కుక్క మొరుగుడు తగ్గింది. ప్రక్క పోర్షన్‌లోంచి దీపంవెలుగు బయటికి పడుతోంది. మూడు నాలుగు గొంతులు గొడవగా మాట్లాడుకుంటున్నాయి.

సుందరం ఇంకేమాత్రం కాలం వృధా చెయ్యకుండా చేతిలో వున్న తాళపు చెవినుపయోగించి తాళం తీసేడు - అటుతర్వాత గడియతీసి తలుపుని లోనికి నెట్టేడు.తలుపు తెరుచుకుంది. కాని లోపలంతా చీకటి. అతడు మెల్లిగా లోపలికి అడుగుపెట్టి తలుపు మూసేడు. అటుతర్వాత చెయ్యి గోడపై వుంచి స్విచ్ కోసం వెతికాడు. చేతికి తగిలిన స్విచ్‌ని నొక్కేడు. ప్రకాశవంతమైన కాంతి గదంతా పరచుకుంది - వెంటనే తలుపు గడియపెట్టి. గదంతా పరిశీలనగా చూసేడు.


అది బాగా వున్నవాళ్ళ యిల్లు.సోఫాలు. కాళ్ళక్రింద మెత్తని తివాసి. ఒకప్రక్క ఎయిర్ కూలర్. మరోవైపున ఫ్రిజ్. బీరువాలు. ప్రక్కగా టేబిలు. దానిపైన టైప్ మిషన్ అన్నిటిని ఒక్క క్షణంలో గమనించేడు. వెంటనే టీపాయ్ వైపుగా చూసేడు. అతడు చెప్పినట్లుగానే నోట్ బుక్కు ప్రమాణంలో వున్న నల్లటి తోలుసంచీ వుంది. సుందరం దాన్ని ఆత్రంగా చేతిలోకి తీసుకోబోయేడు.

అంతలోనే తలుపు చప్పుడయింది!

ఎవరో బయటినుంచి తలుపుని ఆదుర్దాగా ఆత్రంగా. వ్యవధి లేకుండా బాదేస్తున్నారు. సుందరానికి గుండె వేగం హెచ్చింది. కాళ్ళు చేతులు గడ గడమని వణికిపోసాగేయి. గొంతు పూర్తిగా ఎండి. మంటగా వున్నట్లుగా అన్పించింది.

ఇప్పుడు తనేం చెయ్యాలి? బయటవున్న వ్యక్తులకి ఏమని సమాధానం చెప్పాలి? చెప్పినా తన మాట నమ్ముతారా?అసలయినా ఎవరై వుంటారు? పోలీసులా ? వాళ్ళకేం అవసరం? అదే వ్యక్తి తన వెనుకనే వచ్చి తలుపు తడుతున్నాడా? ఎందుకలా చేస్తాడు. అసలు దీనంతటికి వెనుక అర్థంకాని వ్యవహారం వుందా?

బయటనించి తలుపు తడుతూనే వున్నారు.




తలుపు తియ్యటమా? లేక తియ్యక పోవటమా? తియ్యకపోతే తన పైని అనుమానం బలపడే ప్రమాదం వుంది. తర్వాత చెప్పినా ఎవ్వరూనమ్మరు. అంచేత తలుపు తీసి కాళ్ళు పట్టుకుని జరిగినదంతా పూస గ్రుచ్చినట్లుగా చెప్పి. లెంపలేసు కోవటం వుత్తమం. అలా నిర్ణయించిన సుందరం తలుపుగడియని మెల్లిగాతప్పించి కళ్ళు మూసుకుని తలుపుతీసేడు.

ఏ సందడీ లేకపోవటంచేత కళ్ళు తెరిచి చూసేడు. కన్పించిన దృశ్యాన్ని చూసి నవ్వాలో ఏడ్వాలో అర్థంకాలేదు.

పదేళ్ళ కుర్రాడు భయంభయంగా ఆల సటతో రొప్పుతూ నిల్చున్నాడు. అతడు చాలా అందంగాను. అంతకుమించి అమాయకంగాను వున్నాడు. సుందరాన్ని చూసి. అర్థంకానట్లు మొహం పెట్టి "ఆంటీ లేదా?" అనడిగాడు. గుండె దడ తగ్గని సుందరం. గొంతుని తడుపుకుంటూ తలని అడ్డంగా త్రిప్పేడు. ఆ కుర్రాడు తన చేతిలో వున్న పెద తెలుగు నవలని అతడికందిస్తూ "అమ్మ ఆంటీకిచ్చిరమ్మంది" అని. సుందరం దాన్నందుకోగానే. తన పని పూర్తయి నట్లుగా తుర్రుమని పరిగెత్తిపోయాడు.

అతడెళ్ళిపోగానే సుందరం తలుపుని దగ్గరగా వేసి. చేతిలో వున్న పుస్తకాన్ని టీపాయ్‌పై వుంచి. తోలు సంచీని చేతిలోకి తీసుకున్నాడు. అది నిగనిగలాడుతూ అందంగా వుంది. లోపల ఏవో కాగితాలు వున్నట్లుగా గరగరలాడుతున్నాయ్.

అతడాలోచించేడు. ఈ సంచీలో ఏవో విలువైనవి వుండటంవల్లనేగదా ఆ వ్యక్తి తనకి అయిదువంద లిస్తానన్నాడు. అంత విలువైన వస్తువులేమిటి? సహజమైన ఆత్రుతతో. సర్రున జిప్పుని లాగి సంచీ లోపలికి చూసేడు.

* * *

పార్కు దగ్గిర కార్లో కూర్చున్న వ్యక్తి పేపరు చదవటం పూర్తిచేసి. క్రిందికి దిగేడు. ఒక్కసారి. పెద్దగా ఆవులించి. వొళ్ళు బద్ధకంగా విరుచుకుని. టైము చూసుకున్నాడు. అనుమానంగా మొహం పెట్టి జేబులోంచి సిగిరెట్ పెట్టె తీసి ఒకటి ముట్టించుకుని. పొగని గట్టిగా దమ్ముపట్టి. ఆ బిల్డింగు వైపుగా చూసేడు. సుందరం జాడ కానరాకపోవటంతో అతడిలో అసహనం. ఆతృత. అధికమైనాయ్ భయం తాలూకు నీడలు స్పష్టంగా అతడి మొహంలో కన్పించినాయి.

మళ్ళీ టైము చూసి. రెండు క్షణాలు ఆలోచించేడు.

ఏదో నిర్ణయించుకున్న వాడిలా. కదిలి ఆ యింటివైపుగా నడవబోయి. రెండడుగులు వేసి. దూరాన్నించి ఆదుర్దాగా. తొందర తొందరగా వస్తున్న సుందరాన్ని చూసి తృప్తిపడ్డాడు. తిరిగి అతడి పెదవులపై చిరు నవ్వు నాట్యం చేసింది.

సుందరం చాలా కంగారుగా. భయంగా వచ్చేడు వస్తూనే ఆ వ్యక్తితో "ఈసంచిలో ఏవుందో తెలుసునా?" అనడిగాడు.

ఆ వ్యక్తి అదే చిరునవ్వుతో "ఓహో— అంటే సంచీని తెరచి చూసేవన్న మాట." అన్నాడు.

"అవును చూసేను. ఇంతకీ ఆ యిల్లెవరిది? ఆ సంచిలోని .. ........"

ఆ వ్యక్తి అతడి చేతిలో వున్న సంచీని అందుకునే ప్రయత్నంగా. చేయి సాచి.

"అవన్నీ నీకనవసరమని చెప్పాను కదూ?అయినాముందుగానే అనుకున్నట్లు.."

కాని సుందరం మధ్యలోనే అందుకున్నాడు "నా కేదో భయంగా వుంది. ఎందుకు చేశానా అన్పిస్తోంది." అన్నాడు.

ఆ వ్యక్తి విషాన్ని చిందిస్తున్నట్లుగా నవ్వి "పని పూర్తయ్యాక భయమెందుకు? అయినా అంత భయంగలవాడివి ఆ సంచీని అక్కడే వుంచి రాలేకపోయావా!" అన్నాడు వ్యంగ్యంగా.

సుందరం చురుక్కున అతడివంక చూసి తల దించుకున్నాడు. ఆ వ్యక్తి రెండడుగులు దగ్గిరగా వచ్చి. సుందరం చేతిలోవున్న ఆ సంచీని ఒక్క వుదుటున తన చేతిలోకి తీసుకున్నాడు. ఆటు తర్వాత సర్రున ఆ సంచీ జిప్పుని తొలగించి కొన్ని క్షణాలు పరీక్షగా లోనికి చూసి. తృప్తిగా తలాడించి. మళ్ళీ సుందరం వంక చూస్తూ. "నీకు భయం అనిపించినా ఆ సంచీని ఎందుకు తెచ్చావో నాకు తెలుసు—అయిదు వందల కోసం —అవునా?"

సుందరం మౌనముద్ర దాల్చాడు.

అతడే మళ్ళీ అన్నాడు. "మూడ్రోజుల క్రితం నువ్వు ఇంటర్వ్యూకెళ్ళావుకదూ?"

సుందరం ఆశ్చర్యంగా అతడివంక చూస్తున్నాడు.

అతడు మళ్ళీ సుందరాన్ని చూస్తూ భవిష్యత్తు చెప్పగల మణిసిద్ధుడిలా "అది క్యాషియర్ పోస్టు— అవునా?" అన్నాడు

సుందరం కంగారుగా. అయోమయంగా అవునన్నాడు.

"అంతకుమునుపు అక్కడి క్యాషియర్ ఇరవై వేలు తీసుకుని పరారయ్యాడన్న విషయం నీకు బహుశా తెల్సి వుండదు— కదూ?"

సుందరం తెలీదన్నట్లు తల తిప్పేడు.

"ఇపుడా వుద్యోగం నీ క్కావాలి. అవునా?"

"అవును. సంపాదన లేక. వుద్యోగం దొరక్క నానా అగచాట్లు పడుతున్నాం. ప్లీజ్.." అతడే ఆ[illegible]స రన్నట్లు. అక్కడే వుద్యోగ ని[illegible] జరిగిపోతున్నట్లు ప్రతి మాల సాగేడు సుందరం.


ఆ వ్యక్తి చిత్రంగా కళ్ళు తిప్పుతూ "కాని. ఆ కంపెనీవాళ్ళకి నిజాయితీగల కుర్రాడు కావాలిట" అన్నాడు.

సుందరం వె[illegible]నే "సార్-నేనూ నిజాయితీగలవాణ్ణే. ఇపుడు మీరు చూసేరుగదా! చెప్పిన పని చెప్పినట్లుగా చేసుకొచ్చాను."

"నిజమే-చేసుకొచ్చావ్. కాని అయిదు వందలకి ఆశపడి కాదా?"

"సర్-అయిదువందలు అక్కర్లేదు. వుద్యోగం ఇప్పించండి చాలు."

అతడు భుజా లెగరేసి "సారీ-సాధ్యం కాదు" అని కారువైపుగా కదిలాడు.




"ఎందువల్ల? చదువుంది. నిజాయితీ వుంది"

ఆ మాటలువిని అతడు ఆగేడు. ఆగి సుందరంవైపు తీక్షణంగా చూస్తూ "కేవలం అయిదువందలిస్తానని ఆశ చూపించి. నీపైకి ఏమీ రాదని నమ్మించడంవల్ల ఎవరిదో తెలీని ఇంట్లోకి జొరబడి. అంతకన్నా అర్థంకాని ఎవరిదో డబ్బు- అదీ యాభై వేలు- తెచ్చినాచేతిలో వుంచేవు. అదీ కూడా నేనెవరో తెలియకుండా— ఇదేనా నీ నిజాయితీ?"

"యాభై వేలా?"

"రేపు వుద్యోగంలో చేరితే నాలాటి మరొకడు నిన్ను నమ్మించి, డబ్బు ఆశ చూపిస్తే మొత్తం అతడి చేతిలో వుంచేసి— ఏమీ ఎరుగనివాడిలా ప్రవర్తిస్తావ్— అంతేగా?"

సుందరానికి విషయం కొత్త కొత్త అర్థమైనట్లుగా అనిపించి కంగారుగా "ఇంతకీ మీరెవరు?" అనడిగాడు.

కాని అతడా ప్రశ్నని వినన్నట్లుగా "ఇది కూడా నిజాయితీ అనిపించుకుంటుందా?" అన్నాడు. సుందరానికి పౌరుషం ముంచుకొచ్చింది— "ఆ సంచీని చేత్తో పుచ్చుకొని అటునుంచి అటే పారిపోకుండా వచ్చినందుకు బాగా బుద్ధిచెప్పారు."

"పొరపాటు. అసలు నిన్ను పంపినపుడే నాకు తెలుసు- నువు ఆ సంచీని తెరచి చూస్తావని. జస్ట్ హ్యూమన్ సైకాలజీ. అలా చూసిన నువ్వు భయపడి ఆ సంచీని అక్కడే వదలి వచ్చినా. లేక అసలా సంచీని తెరిచి చూడకుండా యాంత్రికంగా తెచ్చి నా చేతిలో వుంచినా. ఈపాటికి వుద్యోగం నీదేనని వాగ్దానం చేసుండే వాడిని- కాని...."

"ఇంతకీ తమరెవరు? ఆ కంపెనీ యజమాని....?"

"కాదు- అక్కడబాధ్యతగల ఆఫీసర్ని. నువ్వెళ్ళి వచ్చిన ఆ యిల్లు నాదే- ఇక ఈ కారు. డబ్బు కంపెనీవి" అని అతడు లోనికెళ్ళి కూర్చున్నాడు.

అప్పుడుగాని సుందరానికి తట్టలేదు- అతడిస్తానన్న డబ్బు ఇవ్వలేదని.

"ఇంతకీ మీ నిజాయితీ ఇదేనా- పన్జేయించుకుని డబ్బివ్వకుండా వెళ్ళిపోవటం...." అన్నాడు అక్కసుగా.

అతడు కారు స్టార్టు చేసి "అయిదు వందలు ఇస్తానని ఆశ చూపించమన్నారే గాని- ఇవ్వమని చెప్పలేదు- అయినా ఆశ చూపించి పన్జేయించుకోవటం శ్రీమంతుల విజయానికి కారణం- కాదంటావా?" సుందరం అవుననే లోపుగానే కారు కదిలి ముందుకెళ్ళిపోయింది.

*


# B.E/B.Tech& M.B.B.S ENTRANCE-'84

The Leading Technical Institute in Vizag, offers Excellent coaching by Experienced Lecturers. Several of our candidates were selected in 1983 entrance Tests.

* Supply of Study Material. * Practice Tests & weekly Tests included * Regular assessment & Parallel Tests. * Separate Classes for English & Telugu Media. * Fee Concession for SC/ST/BC. * Hostel Facility for Boys/ Girls.

| Engineering | Medical |
|---|---|
| I Batch from 16-4-84 | 18-4-84 |
| II Batch from 20-4-84 | 20-4 84 |
| Fee Rs 300/- | Fee Rs 350/- |

Reserve your seat on advance payment of Rs.100/- by Cash/M.O. Applications Rs 1/-Admissions Commenced HURRY UP !

**Visakha College of Engineering & Science**

II Floor, opp· II Town Police Station, Dabagardens, VISAKHAPATNAM-530 020



